# జాబిల్లి అందినవేళ

**- టి.రామాంజనేయులు**

దివి నుండి భువికి దిగిన గంధర్వకాంతయా అన్నట్లు పాలగ్లాసుతో తన ముందు నిల్చున్న ఐశ్వర్యను చూస్తూ రెప్ప వేయడం మరచిపోయాడు హేమంత్.

"హలో సార్! అందరూ నన్ను ఐశ్వర్య అంటారండి. ఈ రోజు మనకు అదేదో ఫస్ట్ నైట్ అట. పాలగ్లాసు చేతికిచ్చి గదిలోకి తోసారు. తమరు స్వప్నజగత్తు నుండి మా లోకానికి వేంచేసి ఈ దీనురాలిని అనుగ్రహించాలని వేడుకుంటున్నాను" నవ్వుతూ పక్కన కూర్చుంది ఐశ్వర్య.

ఐశ్వర్య తన భార్య కావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాడు హేమంత్.

***

స్టేషన్‌లో అడుగుపెట్టేటప్పటికే రైలు కదిలింది. ఏమాత్రం ఆలోచించకుండా అందిన పెట్టెలోకి ఎక్కేసాడు హేమంత్.

'నిరుద్యోగివి నీతో నాకు పనేంటి?' అన్నట్లుగా కూతవేసి వేగాన్ని పుంజుకుంది రైలు. ఖాళీగా కనబడ్డ సీటుపై చతికిలబడ్డాడు.

తాడూ బొంగరంలేని తన జీవితం ఎటు తిరిగి ఎక్కడ ఆగిపోతుందో ఆలోచిస్తూ కళ్లు మూసుకున్నాడు.

అనంతరామయ్యగారు ఆ వూర్లో దేవుడులాంటివాడు. ఏ ఉద్యోగి వూర్లో అడుగుపెట్టినా ఆయనింట ఆతిథ్యం స్వీకరించాల్సిందే.

"నాకు ఉద్యోగం చేయాలని లేదు నాన్నా. ఎలాగూ అగ్రికల్చరల్ బిఎస్సీ చేసానుకదా. ఆదర్శ రైతుగా ఉండాలనుకుంటున్నాను" తన మనసులో మాట చెప్పాడు హేమంత్.

"ఉద్యోగాలంటూ ఊర్లు తిరగవలసిన అవసరం మనకేముందిరా హేమంత్. మాకున్నది నీవేకదా. నీవు మా కళ్లముందు తిరుగుతుంటే అంతేచాలు. నీపై మాకు పూర్తి నమ్మకముంది. అంతా నీ ఇష్టం" అన్నారు తనివితీరా కొడుకును చూస్తూ అనంతరామయ్య.

అసలుసిసలైన రైతుగా మారాడు హేమంత్. తాను పొందిన విజ్ఞానంతో వినూత్న పద్ధతిలో పంటలు పండించేవాడు.

రైతులకు అండదండగా ఉండేవాడు. వరుసగా నాలుగేళ్ళు వానలు సరిగ్గా రాకపోవడంతో వ్యవసాయం జూదంగా మారింది. పెట్టుబడికే నష్టం రాసాగింది. మూడుచోట్ల బోర్లు వేయించాడు. ఖర్చు తప్ప లాభం లేకపోయింది. మంచినీళ్లు కాదు కదా, నీటి చుక్కే కనిపించలేదు. నిరాశ చెందాడు హేమంత్.

చిన్నాచితకా రైతులంతా వలస కూలీలుగా వెళ్లిపోయారు.

ఈ ఏడైనా వరుణదేవుడు కరుణించకపోతాడా అన్న ఆశతో ఎదురుచూడడం, తూతూ మంత్రంగా జల్లులు కురవడం, పంట నష్టం తప్పని సరి అయింది.

ఎందరికో అన్నం పెట్టిన చేతులు అన్నం వెదుక్కోవలసిన స్థితి ఏర్పడింది. విధిలేని -పరిస్థితిలో పొట్ట చేతబట్టుకుని అదృష్టాన్ని వెతుక్కుంటూ రైలెక్కాడు హేమంత్.

"అబ్బా..." ఎవరో బాధగా మూలిగినట్టయింది.

కళ్ళు తెరిచాడు హేమంత్. ఎదురుగా సుమారు యాభై ఏళ్ళుండవచ్చు. సంపన్నుడిలాగానే కనిపిస్తున్నారు.

బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు. తాళం చెవులు చేతిలోవున్నా ఏమీ చేతకాక విలవిల్లాడిపోతున్నాడు.

హేమంత్‌ని చూసి బ్రీఫ్‌కేస్ వైపు చూపించాడు.

విషయం అర్థం చేసుకున్నాడు హేమంత్. వెంటనే బ్రీఫ్‌కేస్‌లోనున్న టాబ్లెట్ తీసి ఆయన నోట్లో వేసాడు.

పదినిముషాల్లో మామూలు స్థితికి వచ్చాడతను.

"నా ప్రాణం నిలపడానికి దేవుడే నిన్ను పంపాడు. నీ రుణం ఎలా తీర్చుకోగలను బాబూ" అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

"మీకు తెలియనిదేముంది సార్. పెద్దవారు. మాలాంటివారిని ఆశీర్వదించాలిగానీ నమస్కరించకూడదు. అయినా ఇందులో నేను చేసిందేముంది. మీరు బాగున్నారు అంతేచాలు" అన్నాడు హేమంత్.

"నీకభ్యంతరం లేకపోతే నీ వివరాలు తెలుసుకోవాలని వుంది బాబూ" అన్నాడాయన.

రైలెక్కింది మొదలు తానెందుకు బయలుదేరాడో బాధతో చెప్పలేక చెప్పాడు హేమంత్.

"ఇలాంటి సమయంలో నాకు తోడు లేకపోవడం ఎంత ఇబ్బందికరమో నువ్వు చూసావుకదా! నీకు సమ్మతమైతే అన్నివిధాలా నాకు పర్సనల్ అసిస్టెంట్‌గా ఉండగలవా? జీతం ఏమాత్రం తక్కువ చేయనులే. ఆలోచించుకో బాబూ" అన్నాడాయన.

దప్పికతో ప్రాణం పోతున్న వాడి నోట్లో అమృతం పోసినట్లయింది. ప్రస్తుతానికి ఏదో ఒక అండ కావాలి.

చేసే పని నచ్చకపోతే అప్పుడు ఆలోచించుకోవచ్చు. సంతోషంగా తన అంగీకారాన్ని తెలిపాడు హేమంత్.

***

స్వంత ఊర్లో ఉన్న ఇంటిని అమ్మేసి భార్యను వెంటబెట్టుకుని కట్టుబట్టలతో పట్టణానికి వచ్చాడు మోహనరావు.

బంధువులంతా మొహం చాటేసారేగానీ ఒక్కరు కూడా సహాయం చేయలేదు. ఒక చిన్న షాపులో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం దొరికింది. మోహనరావు చేరాక షాపులో అమ్మకాలు బాగా పెరిగాయి.

"బిడ్డా మోహన్! నీ తెలివితేటలకు నా షాపులో ఈ చిన్న ఉద్యోగం నీకు సరిపోదయ్యా. ఇక్కడ నీవు ఎన్నాళ్లు పనిచేసినా నీ ఆదాయం బెత్తడే. నీవే సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించు. కావాల్సిన సహాయం నేను చేస్తాను" అన్నాడు షాపు

యజమాని ధన్‌లాల్.

ఒక చిన్న గార్మెంట్ షాపుతో వ్యాపారం ప్రారంభించాడు.

సహాయం చేసిన ధన్‌లాల్‌గారి గొప్పతనమో, ప్రారంభించిన వేళావిశేషమో, టెంకాయ కొట్టిన భార్య చేతి మహత్యమో... మోహన్‌రావు పట్టిందల్లా బంగారమయింది.


అంచెలంచెలుగా వ్యాపారాన్ని పెంచాడు. నగరంలో పేరుపొందిన పారిశ్రామికవేత్తలలో ఒకడిగా నిలిచాడు.

తాను తల్లిని కాబోతున్నాననే శుభవార్తను అందించింది భార్య.

కేవలం సంపాదనపైనే దృష్టి నిలిపానుగానీ, పిల్లల గురించి ఆలోచనలకు తావివ్వలేదు. తాను కష్టాలు పడుతున్నా ఏమాత్రం బయట పడకుండా నాకు అన్నివిధాలా సహకరించి ఇప్పుడు తండ్రిగా మరో మెట్టుపై నిలపబోతున్న నా భార్య నిజంగా ఉత్తమురాలు. భార్యపై అనురాగం రెట్టింపయింది.

కూతురు పుట్టిందని తన ఉద్యోగులందరికీ బోనస్ ప్రకటించాడు మోహనరావు.

తాను ఐశ్వర్యవంతుడయ్యాక పుట్టింది కాబట్టి కూతురికి ఐశ్వర్య అని పేరు పెట్టాడు.



తండ్రి గుణాలతో, తల్లి అందంతో పుత్తడిబొమ్మలా పెరిగింది ఐశ్వర్య. విధి ఎంతటి క్రూరమైనదో!

కాన్వెంట్ నుండి ఇంటికి వస్తున్న కారుకు యాక్సిడెంట్ జరిగింది. ఐశ్వర్య గాయాలతో బయటపడింది.

డ్రైవర్, ఐశ్వర్య తల్లి మరణించారు. దిగులుతో కృంగిపోకుండా ఐశ్వర్యను పెంచాడు మోహనరావు. కూతురి అభీష్టం మేరకు కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివించాడు.

వ్యాపార రంగంలో ఎవరినీ నమ్మరాదు. ఊరు వదిలిననాడు మొహం తిప్పుకున్న తనవారికి ఇప్పుడు బంధుత్వం గుర్తుకొచ్చింది. ఉన్నది ఒక్క కూతురే కదా,


అవకాశం దొరికితే ఆస్తిని కొట్టేయాలని గుంటనక్కల్లా వేచి వున్నారు. అందుకే ఐశ్వర్యను వ్యాపారరంగంలో ప్రవేశపెట్టాడు మోహనరావు.

ఆరోగ్యంగా వున్న మోహనరావుకు అనుకోకుండా గుండెనొప్పి వచ్చింది.



## మంచి పాత్రలు కావాలి

రాణీ ముఖర్జీ తాజా చిత్రం 'బ్లాక్' అంతగా విజయం సాధించకపోయినా నటిగా ఆమెకి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇలా కేవలం గ్లామర్ స్టార్లుగానే కాకుండా మంచి నటీమణులం మేము అనిపించుకోవాలని ఇప్పుడు చాలా మంది తారలు ఉబలాటపడుతున్నారట బాలీవుడ్‌లో. అలా రెడీ అవుతున్న తారల్లో అమీషా పటేల్ కూడా వుంది. తనకి నటనకు అవకాశం వుండే మంచి పాత్రల్ని ఇమ్మని నిర్మాతల్ని కోరుతోందిట. 'బ్లాక్'లాంటి వెరయిటీ కథా చిత్రాల్లో నటించాలని నాకు చాలా ఇంటరెస్టుగా వుందని చెబుతోంది. అంతే మరి! సంపాదన ఓ స్థాయికి వచ్చేశాక ఇక పేరు గురించేగా పాటుపడేది!




"స్మాల్ స్ట్రోక్ సార్. భయపడవలసింది ఏమీలేదు. ఎక్కువగా టెన్షన్ పడకండి. ఇకపై ఇలా రాకుండా చూసుకోవడం మంచిది. ఈ టాబ్లెట్స్ ఎప్పుడూ మీతోనే వుంచుకోండి'' డాక్టర్లు సలహా ఇచ్చారు.

ఆనాటి నుండి ఐశ్వర్యకు అన్ని సలహాలు ఇస్తూ తాను వ్యాపారానికి సాధ్యమైనంతవరకూ దూరంగా వుంటున్నాడు.

విధిలేని పరిస్థితుల్లో బిజినెస్ కాన్ఫరెన్స్‌కు వెళ్లివస్తూ మరోసారి గుండెనొప్పికి గురయ్యాడు. ఇప్పుడు హేమంత్ సహాయంతో అపాయం నుండి బైటపడ్డాడు.

★★★

"ఐశ్వర్యా! ఇతని పేరు హేమంత్. ఈ రోజు నుండి నాకు పిఏగా వుంటాడు. బిజినెస్‌లో నీకు సహాయంగా మనింట్లోనే ఉంటాడు. అతనికి కావాల్సిన సౌకర్యాలు చూడు'' అన్నాడు మోహనరావు.

"సార్'' అంటూ ఏదో చెప్పబోయిన హేమంత్‌ను కళ్లతోనే వారించి లోపలికి వెళ్లిపోయాడు. తండ్రి నిర్ణయంపై పూర్తి విశ్వాసమున్న ఐశ్వర్య మారు మాట్లాడలేదు.

మొదటిసారి ఐశ్వర్యను చూడగానే అనిర్వచనీయమైన అనుభూతి గుండెను కదిలించింది.

లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అంటే ఇదేనేమో! అయినా నక్కెక్కడా? నాగలోకమెక్కడ?

ఆశాలోకంలో విహరించే మనసును తన అధీనంలోకి తెచ్చుకున్నాడు హేమంత్.

మోహనరావు, ఐశ్వర్యలు తనపై చూపే ఆదరాభిమానాలకు బందీ అయ్యాడు హేమంత్.

వారి కుటుంబంలో ఒకనిగా కలిసిపోయాడు. చేసే పని నచ్చకపోతే అనే ఆలోచన మనసులోకి రాలేదు.

అందరాని చందమామ అని తెలిసినా ఐశ్వర్యను మనసులోనే ఆరాధించసాగాడు.

అప్పుడప్పుడు తల్లిదండ్రులను చూసి వస్తున్నాడు. ఒక్క ఐశ్వర్యపై తనకున్న అనురాగం గురించితప్ప అన్ని విషయాలూ తల్లిదండ్రులకు చెప్పేవాడు.

★★★

"అమ్మా ఐశ్వర్యా! హేమంత్‌పై నీ అభిప్రాయమేమిటి?'' తండ్రి అకస్మాత్తుగా అడిగేసరికి ఆశ్చర్యపోయింది ఐశ్వర్య.

"డొంక తిరుగుడు వ్యవహారాలు నాకు నచ్చవని నీకు తెలుసుకదమ్మా. హేమంత్ ఎవరని నీవు నన్ను అడగలేదు. నీకు తెలియకుండా దాచిన రహస్యం ఒకటుంది. భయపడకుండా జాగ్రత్తగా విను. నాకు రెండోసారి స్ట్రోక్ వచ్చింది. అలాంటి సమయంలో నా ప్రాణాలు కాపాడినవాడు హేమంత్'' అంటూ ఆనాడు రైలు ప్రయాణంలో జరిగిన విషయం పూర్తిగా ఐశ్వర్యకు వివరించాడు మోహనరావు.

ఆలోచనలో పడింది ఐశ్వర్య. మొదట్లో హేమంత్‌పై తనకు ఎలాంటి అభిప్రాయం కలగలేదు.

ఇంట్లోనే వుంటున్నా ఆఫీసు వ్యవహారాల్లో ఎంతగా చనువిచ్చినా ఏనాడూ హద్దు మీరి ప్రవర్తించలేదు.

అతని నడవడి, నిరాడంబరత, వ్యవహార దక్షతను గమనించాక ఇలాంటి వాడు తనకు భర్తగా దొరికితే... అనే ఆలోచన అప్పుడప్పుడు తలపులోకి వచ్చేది.

అయినా ఒక హోదాలో వున్న నేను హేమంత్ అభిప్రాయం తెలుసుకోకుండా బయటపడితే చులకన అవుతానేమో!

హేమంత్ ఒక్కరోజు కనిపించకపోతే మనసులో ఏదో వెలితిగా ఉన్నట్లుండేది.

అతని గురించి ఆలోచనలు మదిలో మెదులుతున్నాయంటే నాకు తెలియకుండా నేను హేమంత్‌ను ప్రేమిస్తున్నానా?... రాత్రంతా ఇలాంటి ఆలోచనలతోనే గడిపింది.

"నాన్నగారూ! నా బాగోగులు నాకంటే మీకే బాగా తెలుసు. హేమంత్ అన్ని విధాలా యోగ్యుడే. ముందుగా ఆయన అభిప్రాయం తెలుసుకోకుండా మనమే నిర్ణయాలు తీసుకోవడం..." అంటూ ఆగిపోయింది ఐశ్వర్య.

"నువ్వు గ్రీన్ సిగ్నల్ ఇచ్చావు. ఇక చూసుకో... వ్యాపారంలోనే కాదు వ్యవహారంలోనూ మీ నాన్న ఫస్ట్ అని నీచేతనే అనిపిస్తాను చూడు" అంటూ ఉత్సాహంగా బయటకు నడిచాడు మోహనరావు.

***

"నిన్ను ఉద్యోగంలోంచి తీసేయాలనుకుంటున్నాను హేమంత్" అన్నాడు సీరియస్‌గా మోహనరావు.

"సార్! తెలిసి నేను ఏ తప్పూ చేయలేదు. తెలియక ఏదైనా పొరపాటు చేసివుంటే పెద్దవారు సహృదయంతో మన్నించండి. నేను చేసిన తప్పు తెలియజేస్తే సరిదిద్దుకుంటాను" వినయంగా అడిగాడు హేమంత్.

"ఎన్నాళ్ళు నీ తల్లిదండ్రులను కష్టపెట్టాలనుకుంటున్నావు. జీవితంలో ఇంతకన్నా పెద్ద తప్పు ఏముంటుంది. అయినా ఈ ముసుగులో గుద్దులాట దేనికి? నిన్ను నా అల్లునిగా చేసుకోవాలనుకుంటున్నాను. నేనేదో నీకు సాయం చేసానన్న మొహమాటాన్ని పక్కకుపెట్టి నీ అభిప్రాయం చెప్పేస్తే పెద్దవాళ్లం మా పనులేవో మేము చూసుకుంటాం" అన్నాడు నవ్వుతూ మోహనరావు.

అమృతభాండాన్ని తలపై బోర్లించినట్లుగా ఉక్కిరిబిక్కిరయ్యాడు హేమంత్.

"సార్! ఆశకు కూడా హద్దు వుంటుంది. మీరడిగారు కదాని నేను ఒప్పుకుంటే అది దురాశ అవుతుంది. అయినా పొట్టకూటికోసం మీ దగ్గర పని చేసుకుంటున్న నేను మీతో వియ్యమందడమా? నాకలాంటి ఆశ లేదు. ఈ విషయంలో నన్ను మన్నించండి" అన్నాడు హేమంత్.

"అలాగే హేమంత్! ఆ రోజు పోయే ప్రాణం కాపాడావు. నీవు నిలిపిన ప్రాణాన్ని నీవు తీసుకుపోదువుగానీ" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నాడు మోహనరావు.

"అలా అనకండి సార్. నేను కృతఘ్నుడ్ని కాదు. నా జీవితాన్ని నిలబెట్టిన మీకోసం నా ప్రాణమివ్వడానికైనా సిద్ధమే" అన్నాడు హేమంత్.

"చూడు హేమంత్! డబ్బు విలువ ఏమిటో నాకు బాగా తెలుసు. మూడోసారి స్ట్రోక్ వచ్చిందంటే నేను బ్రతకగలనా? గుంటనక్కల్లా వేచివున్న బంధువులు నా కూతుర్ని, నా ఐశ్వర్యాన్ని దోచుకోకుండా ఉంటారా? నీ వ్యక్తిత్వం పట్ల నాకు నమ్మకముంది. నీవు తోడుంటే ఐశ్వర్య సుఖంగా జీవిస్తుంది. ఐశ్వర్య అంగీకారంతోనే నిన్ను అడిగాను. నా ప్రాణదాతగా నిలుస్తావో, ప్రాణాలు తీసుకుపోతావో నీవే నిర్ణయించుకో" ఆవేదనతో పలికాడు మోహనరావు.

'మరీ ఎక్కువగా బెట్టు చూపడం ధూర్తలక్షణం అవుతుందేమో! ఐశ్వర్య నా కలల రాణియేకదా. ఇక ఆలోచనలు అనవసరం' అనుకున్నాడు హేమంత్.

"మీ ఇష్టం సార్" అన్నాడు చిరునవ్వుతో.

***

రాజు తలచుకుంటే కొదవేముంది.

నభూతో నభవిష్యతి అన్నంత వైభవంగా ఐశ్వర్యా, హేమంత్‌లు భార్యాభర్తలయ్యారు.

ఈ రోజు వారి తొలిరాత్రి.

ఒకనాడు ఐశ్వర్య అందరాని చందమామ అనుకున్నాడు. ఆ నిండు జాబిల్లి సుధలు కురిపిస్తూ తనకు అందినవేళ నా జీవితంలోనే మధురాతి మధురమైనది.

ఊహాలోకంలో విహరిస్తున్న హేమంత్ ఐశ్వర్య మాటలతో వాస్తవానికొచ్చాడు.

ఐశ్వర్యతో ఇన్నాళ్లుగా కలసివున్నా ఏనాడూ కలగని వింత అనుభూతి... ఇక ఊహలతో కాలం వేస్ట్ చేయక స్విచ్ ఆఫ్ చేయడానికి చేయి చాపాడు హేమంత్.

★

## ఘనమైన పాటకి వందేళ్ళు

1930లో పూనాలోని యర్రవాడా జైల్లో ఉన్న గాంధీజీ సారే జహాసే అచ్ఛా అన్న గీతాన్ని వందసార్లు పాడారుట. అంతరిక్షంలోకి వెళ్ళిన రాకేశ్‌శర్మని 'మనదేశం అక్కడ్నించి ఎలా కనిపిస్తోంది?' అని ఇందిరాగాంధీ అడిగితే 'సారే జహాసే అచ్ఛా హిందుస్థాన్ హమారా' అన్నాడప్పుడు. అల్లామా ఇక్బల్ రాసిన ఆ పాటకిప్పుడు వందేళ్ళు నిండాయి. అసలా పాట ఆయన పాడేవరకూ ఇక్బాల్ గురించి దేశంలో చాలామందికి పెద్దగా తెలియదు. 1904లో లాహోర్ కాలేజ్‌లో ఒక లెక్చరర్‌గా పనిచేసేవాడు ఇక్బాల్. ఆయన స్టూడెంట్ లాలా హర్దయాల్ అమెరికాలో యంగ్‌మెన్ ఇండియన్ అసోసియేషన్ మెంబర్‌గా ఉండేవాడు. తన సహచరులతో కలిసి గదర్‌పార్టీని స్థాపించాడు. వాళ్ళ పార్టీ మీటింగ్‌కి తన గురువుగార్ని ఆహ్వానించాడు. ఆయనకి రాజకీయ ఉపన్యాసం ఇవ్వడం ఇష్టం లేక అంతకుముందే తను రాసిన కవిత సారే జహాసే అచ్ఛాని పాడాడట.

## భలే ఫైన్

సెల్‌ఫోన్‌లో హాయిగా మాట్లాడుకుంటూ కులాసాగా బైక్‌లమీద, కార్లలో తిరిగే వారు ట్రాఫిక్ పోలీసుల కళ్ళు కప్పి ఇంటికెళ్ళి హాయిగా రెస్ట్ తీసుకోవడం ఇక కుదరదు. అమెరికన్ తరహాలో మీ వెహికల్ నెంబర్‌ని బట్టి మీ ఇంటి అడ్రస్‌కో నోటీసొస్తుంది. సంబంధిత ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లోనో, ఈసేవ సెంటర్‌లోనో మీరా ఫైన్ కట్టక తప్పదు అంటున్నారు హైదరాబాద్ పోలీసులు.

